బాబోయ్.. ఎండలు!

- ప్రారంభమైన కళింగర కాయల విక్రయ కేంద్రాలు
- ఉపాధి లేక వీధి వ్యాపారులుగా కూలీలు



తాడిపత్రి పట్టణంలో విక్రయానికి ఉంచిన కళింగర కాయలు

తాడిపత్రి రూరల్: వేసవి రాకనే ఎండల తీవ్రత ప్రారంభమైంది. శివరాత్రి పండుగ మరో 15 రోజులకు పైగా ఉన్నప్పటికి ఎండలు మండుతున్నాయి. ఉదయం 11 గంటలు దాటితే భానుడు భగభగ మంటున్నాడు. సాయంత్రం 4 గంటల వరకూ అదే తీవ్రత కనిపిస్తోంది. వేసవి తాపం తీర్చు కోవడానికి ప్రజలు ఎక్కువగా కళింగర కాయలపై ఆధారపడుతున్నారు. పట్టణ, రూరల్ ప్రాంతంలో కేంద్రాలను ఏర్పాటు చేసుకుని పలువురు వ్యాపారులు కళింగర విక్రయాలు జరుపుతున్నారు. యాడికి మండలం, పెద్దపప్పూరు మండలంలోని అశ్వర్థం తిరునాలలలో విక్రయ కేంద్రాలు ఎక్కువగా ఉంటున్నాయి. గతంలో కాయల సైజు బట్టి ధరను నిర్ణయించేవారు. ప్రస్తుతం కిలోల ప్రకారం కాయలను అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం కిలో రూ.30 ధర పలుకుతోంది. విక్రయ కేంద్రాలకు వచ్చిన ప్రజలను మొదట పది కిలోలకు పైగా బరువు ఉన్న పెద్ద సైజు కాయలను బేరమాడుతున్నారు. కిలోల ప్రకారం కాయ రూ.300 కు పైగా ధర వ్యాపారులు చెపుతుండటంతో వెనుకడుగు వేస్తున్నారు. ధర ఎక్కువగా ఉండటంతో చిన్న సైజు కాయలను కొనుగోలు చేయడానికి మొగ్గుచూపుతున్నారు. మరికొందరు తాటిముంజెలు, శీతల పానీయాలతో వేసవి తాపం తీర్చుకుంటున్నారు.

కదిరి ప్రాంతం నుంచి వీధి వ్యాపారుల కొనుగోలు..

తాడిపత్రి ప్రాంతానికి చెందిన వ్యాపారులు కదిరి ప్రాంతం నుంచి కళింగర కాయలను కొనుగోలు చేస్తున్నారు. అక్కడ దళారులు కాయల సైజును బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. టన్ను రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకూ ధర ఉంటోంది. కళింగర కాయలను తాడిపత్రిలోని మునిసిపల్ స్థలంలో కొనుగోలు కేంద్రం వేసుకున్నందుకు నాలుగు నెలకు కలిపి రూ.1300 వసూలు చేస్తున్నారు. మునిసిపల్ గేట్ పేరుతో కాయలతో వచ్చిన ఒక్కో వాహనానికి రూ.500 చొప్పున కాంట్రాక్ట్ కింద సిబ్బంది వసూలు చేస్తున్నారు. తాడిపత్రి పట్టణంలోని ర్టీసీ బస్టాండ్ సర్కిల్, అశోక్ పిల్లర్, గన్నెవారిపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో దాదాపు పది కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని కళింగర విక్రయ కేంద్రాలు పెరుగనున్నాయి.

ఉపాధి లేక.. కాయలు విక్రయిస్తూ..

తాడిపత్రి ప్రాంతంలోని వివిధ వృత్తుల కూలీలు ఆయా రంగాల్లో ఉపాధిని కోల్పోయి వీధి వ్యాపారులుగా మారారు. సీజన్ వ్యాపారం కావడంతో ఫిబ్రవరి నుంచి జూన్ నెలాఖరు వరకూ రోడ్ల పక్కన తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేసుకుని కళింగర కాయల విక్రయాలు జరుపుతున్నారు. వీరిలో ఎక్కువగా చేనేత వ్యాపారులు, బండల పాలిష్ యునిట్లు, సీజన్ బట్టి వివిధ రకాల పండ్ల వ్యాపారం చేసేవారు ఉన్నారు.

ధరలు ఎక్కువగా ఉన్నాయి



కళింగర కాయల ధరలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో కాయల సైజును బట్టి ధర నిర్ణయించేవారు. ప్రస్తుతం వ్యాపారులు కిలోల ప్రకారం విక్రయిస్తున్నారు. చిన్న సైజు కాయ కూడా రూ.50 ఉంటోంది. ఎండలు ఎక్కువగా ఉండటంతో కళింగర ధర ఎక్కువ చెబుతున్నారు. – ఫక్రుబీ

చేనేతలో నష్టం వచ్చి..



20 ఏళ్లుగా కళింగర కాయల వ్యాపారం చేస్తున్నాను. గతంలో చేనేత పని చేసేవాడిని. అప్పట్లో రేషం ధరలు పెరగడంతో గిట్టుబాటు లేక కూలీగా చీరలకు రంగులు అద్దుతున్నాను. వేసవి కాలంలో కలింగర కాయల వ్యాపారం చేస్తున్నాను.
– శ్రీనివాసులు, తాడిపత్రి

పాలిష్ యునిట్లలో పని లేక..



గతంలో బండల పాలీష్ యునిట్‌లో కూలీగా పనిచేసేవాడిని. అక్కడ పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ కోసం సీజన్‌ను బట్టి వివిధ వ్యాపారాలు చేస్తున్నాను. ప్రస్తుత సీజన్‌లో కలింగర కాయల వ్యాపారం చేస్తున్నాను.
– గోపాల్, తాడిపత్రి

జగనన్నతోనే ప్రజా సంక్షేమం


నైరుతిరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్

గుంతకల్లుటౌన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన ఎం.డీ.ఆర్.ఖలీల్ ఆదివారం పార్టీ కార్యాలయంలో నైరుతిరెడ్డితో పాటు బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి రామలింగప్ప, వైస్‌చైర్‌పర్సన్ మైమూన్‌ను వేర్వేరుగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నైరుతిరెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలలైనా వాటిని అమలు చేయకుండా ప్రజలకు చేసిన మోసాల్ని వివరించాలన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడి పనిచేయాలని ఆమె సూచించారు. తనపై నమ్మకంతో పార్టీ పట్టణ అధ్యక్ష పదవిని అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్, జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌కు ఖలీల్ కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ సుమో బాషా, సీనియర్ నాయకుడు నూర్‌నిజామి, నియోజకవర్గ పోలింగ్ బూత్ కన్వీనర్ ఎంబీ.మౌలా, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు తిక్కస్వామి, వాల్మీకి పవన్, షాబుద్దీన్, నాయకులు గఫార్, మన్సూన్,గౌస్, మహ్మద్, లోకేష్, ప్రతాప్, జాకీర్, మస్తాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి


ఇళ్ల స్థలాల కోసం అర్జీలు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్: నిరుపేదలకు ఉచితంగా స్థలాలు మంజూరు చేసి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.4 లక్షలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక పట్టణాల్లో నివసించే పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు మూడు సెంట్లు స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.4లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీని అమలు చేసి పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు, నాయకులు రామాంజి, నాగేంద్ర, రత్నమయ్య, అబ్రహం, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల కోసం తిప్పలు


తాడిపత్రి పట్టణంలోని రేషన్ షాపు వద్ద సరుకుల కోసం గుమిగూడిన లబ్ధిదారులు


ఎండీయూ వాహనానికి స్టిక్కర్ తొలగిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: జగనన్న ప్రభుత్వంలో నేరుగా అందుతున్న రేషన్ బియ్యం కోసం కూటమి ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నెల ప్రారంభం కాగానే రేషన్ దుకాణాల వద్ద ప్రజలు పనులు మానుకుని బారులు తీరి కనిపిస్తూ వేదన చెందుతున్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు నేరుగా రేషన్ అందజేసిన వాహనాలు చెత్తకుప్పల పాలయ్యాయి. కొంత మంది వాహనానికి ఉన్న జగనన్న స్టికర్ తొలగించి సొంత పనులకు వాడుకుంటున్నారు. అయినా ప్రభుత్వం ఏమాత్రం స్పందించకుండా లక్షలాది రూపాయలు వెచ్చించిన వాహనాలను వినియోగంలోకి తేవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.. తాడిపత్రి పట్టణంలోని కాలువగడ్డ వీధిలో ఓ రేషన్ దుకాణానికి చెందిన ఎండీయూ వాహనానికి ఉన్న స్టిక్కర్‌ను కొంత మంది తొలగించడంతో ప్రజలు గత వైఎస్సార్‌సీపీ హయాంలోని రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ఎండీయూ వాహనం ఇంటింటికీ వచ్చి సరుకులు అందజేసేదన్నారు.

బాల ఏసు ప్రతిమ ఊరేగింపు



తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు గ్రామంలో శనివారం బాల ఏసు చర్చి మహోత్సవాన్ని పురస్కరించుకుని బాల ఏసు ప్రతిమను ఊరేగించారు. పాస్టర్లు డేవిడ్ అర్లప్ప, రాజశేఖర్, బాల కలిసి దివ్య బలి పూజను నిర్వహించారు. అనంతరం పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో అవులతిప్పాయపల్లి, సజ్జలదిన్నె గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పండ్ల తోటల గట్లకు నిప్పు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని వరాలు తోట వద్ద పెన్నానది పరివాహక ప్రాంతంలో శనివారం రాత్రి పలు పండ్ల తోటల గట్లకు అకతాయిలు నిప్పు పెట్టారు. ప్రమాదాన్ని గమనించిన రైతులు తోటల్లోని మోటర్లను ఆన్ చేసి ఆ నీటితో మంటలను ఆర్పివేశారు. ఏ మాత్రం జాప్యం జరిగినా దాసు, ప్రసాద్‌తో పాటు మరో రైతుకు చెందిన 10 ఎకరాల్లోని జామ, సపోట, మునగ చెట్లు అగ్నికి ఆహుతయ్యేవి. కాయలతో ఉన్న పండ్ల తోటలు అగ్ని ప్రమాదం నుంచి రక్షించుకోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా రాత్రి సమయాల్లో పెన్నానది పరివాహక ప్రాంతంలో ఆకతాయిల ఆకృత్యాలు పెరిగిపోతున్నాయని అన్నదాతలు వాపోయారు. పోలీసుల నిఘా లేకపోవడంతో మందుబాబుల సంఖ్య కూడా అధికంగా ఉంటోందన్నారు. వారు సిగరెట్లు తాగి పడేయడంతోనే గట్లు అగ్నికి ఆహుతయ్యాయన్నారు.

నేడు ఆల్బెండజోల్ పంపిణీ

శింగనమల/గార్లదిన్నె: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, బడి బయట ఉన్న ఆరు నెలల నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామని శింగనమల మండలంలోని తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్ నాయక్, గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు దిలీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం వారు వేర్వేరుగా మాట్లాడారు. వైద్య సిబ్బంది ప్రతి పాఠశాలకూ వెళ్లి విద్యార్థులకు ఆల్బెండజెల్ అందజేస్తారన్నారు.

ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం

తాడిపత్రి అర్బన్: భీష్మ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన భాగవత సప్తాహ మహోత్సవ కార్యక్రమం ఆదివారం ముగిసింది. స్థానిక రెడ్డివారిపాలెంలోని కోదండరామస్వామి ఆలయంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి ఏడు రోజులు 24 గంటల పాటు ఏకధాటిగా అఖండ శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామ సహిత విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ సప్తాహ మహోత్సవాన్ని నిర్వహించారు. చివరి రోజు ఆదివారం లక్ష్మీ నారాయణ హోమం నిర్వహించి మహోత్సవాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞతార్పణల పండుగ

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన కృతజ్ఞతార్పణల పండుగ ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. దేవునికి కృతజ్ఞతార్పణలు చెల్లించడంలో ప్రతిఒక్కరూ ధారాళత్వం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్ రోడ్డులోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. జొన్నగిరికి చెందిన రాజేష్, రాజు బైక్‌లో పని మీద గుత్తికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి జొన్నగిరికి వెళ్తుండగా మార్గ మధ్యలో వెనుక నుంచి ఆటో ఢీ కొంది. ఘటనలో గాయపడిన ఇద్దరినీ స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి తిరునాల

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల ఘనంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, ఏకవార రుద్రా భిషేకం సహస్ర నామార్చన తదితర పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే గాక జిల్లా నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని 108 సాలగ్రామ శివలింగాలకు భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గాజులు అంగళ్లు, తినుబండారాలు, చెరకు, బొరుగుల అంగళ్లు ఏర్పాటు చేశారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

భక్తులకు అన్నదానం ...

తిరునాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రతి ఏటా మాదిరిగా రెండవ ఆదివారం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తన తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి తల్లి వెంకటసుబ్బమ్మ, సోదరులు కొండారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, స్వామి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు, అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక


పీడీ అయూబ్‌ఖాన్

గుంతకల్లు: స్థానిక ఇందిరనగర్‌లో నివాసముంటున్న ఫీజికల్ డైరెక్టర్ (పీడీ) అయూబ్‌ఖాన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విడపనకల్లు మండలం గడేకల్లు హైస్కూల్‌లో పీడీగా పని చేస్తున్న అయూబ్‌ఖాన్ శనివారం అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి మాస్టర్ 800 మీటర్ల అథ్లెటిక్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో అయూబ్‌ను రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేశారు. ఆయనను తోటి ఉపాధ్యాయులు, సహచరులు అభినందించి రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

సేవాఘడ్‌లో దుకాణాల ఏర్పాటుకు నేడు వేలం

గుత్తి రూరల్: మండలంలోని సేవాఘడ్‌లో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో దుకాణాల ఏర్పాటుకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెంకాయలు, బొమ్మల దుకాణాలు, లడ్డూ ప్రసాదం, ఐస్‌క్రీమ్ బండ్లు, జాయింట్ వీల్స్, కొబ్బరి చిప్పలు, పూల హారాలు, పండ్లు, చిత్రపటాల దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు రూ.500 చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వేలం ఉంటుందని, మరిన్ని వివరాలకు పూజారి మారుతీ ప్రసాద్ (9703700771)ను సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్‌కు సన్మానం



పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని ఓ హోటల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌గా ఎంపికైన మధుసూదన్‌రెడ్డిని పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వెంకీ, బాషా, హరి నాథ్‌రెడ్డి, హరి, కెఎం రంగ నాయకులు, నాగేంద్ర, నాగరాజు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

12 నుంచి విగ్రహాల ప్రతిష్ట

తాడిపత్రి రూరల్: మండలంలోని ఊరుచింతల గ్రామంలో ఈ నెల 12 నుంచి పెద్దమ్మతల్లి, ఎల్లమ్మతల్లి గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు శనివారం నిర్వాహకులు తెలిపారు. 12న మహాగణపతి పూజ, గోపూజ, అఖండ దీపారాధన, వేదస్వస్తి నివేదన తదితర కార్యక్రమాలు, 13న వేద పారాయణం, గ్రామోత్సవం, మహా మంగళ హారతి, నివేదన, మూలమంత్ర జపం, దీక్షా హోమం తదితర కార్యక్రమాలుంటాయన్నారు. 14న తెల్లవారుజామున యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ, ప్రతిష్ఠ హోమం, ప్రాణ ప్రతిష్ఠ, గోముఖ దర్శనం, విశ్వ రూప దర్శనం తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

మరువ వంకలో కారు బోల్తా



బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో అనంతపురం-తాడిపత్రి రహదారి పక్కన ఉన్న మరువ వంకలో కారు బోల్తా పడింది. స్థానికుల వివరాల మేరకు.. అనంతపురం నుంచి తాడిపత్రి వైపు కారు వెళ్తున్న ఓ వ్యక్తి మరువ వంక సమీపంలో రోడ్డు పక్కన స్వెటర్ కొనేందుకు కారును నిలిపాడు. హ్యాండల్ లాక్ వేయకపోవడంతో కారు మరువ వంకలోకి దూసుకెళ్లింది. కారులో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. యజమాని జేసీబీ సహాయంతో కారును బయటకు తీసుకుని వెళ్లాడు. ఘటనపై సమాచారం లేదని సీఐ కరుణాకర్ తెలిపారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

బుక్కరాయసముద్రం: మండలంలోని దండువారిపల్లి చెరువుకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తున్నట్లు ఆ పార్టీ శింగనమల నియోజకవర్గ కార్యదర్శి నారాయణ స్వామి ఆదివారం తెలిపారు. దండువారిపల్లి చెరువకు నీరు వదలాలని అనేక మార్లు విన్నవించినా ఎవరూ పట్టించు కోలేదన్నారు. దండువారిపల్లి, ఏడావులపర్తి గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాటు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. సీపీఐ కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నాయకులు

గుంతకల్లు: ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ అంబేడ్కర్ భవన్‌లో గుంతకల్లు నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జిల్లా వారీగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టో ద్వారా ఎన్‌డీఏ కూటమి మాదిగలకు ఇచ్చిన హామీ ఇంతవరకూ అమలు చేయలేదని మండిపడ్డారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. ఏపీలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏర్పాటైన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ నివేదికను ప్రభుత్వానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్, ప్రధాన కార్యదర్శి వై.అశోక్‌కుమార్, గుంతకల్లు నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహులు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణిభూషన్, జి.మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.రామదాసు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

యాడికి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు పథకాల కోసం రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ మహబూబ్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు కార్డు వల్ల రైతులకు పీఎం కిసాన్ పథకం, బ్యాంకు రుణాలు, పెట్టుబడి రాయితీలు వివిధ రకాల సబ్సిడీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తాయన్నారు. రైతులు ఆధార్ కార్డు, మొబైల్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

గార్లదిన్నె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నాయని ఏఓ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం ఏఓ మాట్లాడుతూ సోమవారం నుంచి అన్ని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు వివరాల నమోదు కార్య క్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రైతూ పట్టాదారు పాసు పుస్త కం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తదితర వివరాలు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. విశిష్ట గుర్తింపు కార్డు ఉంటే పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్రపరికరాలపై రాయితీలు అందుతాయన్నారు.

పరామర్శ


వెంకటేష్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మంజునాథ్‌రెడ్డి

పామిడి: పట్టణంలోని పామిడమ్మ వీధికి చెందిన బోయ శ్రీనివాసులు కుమారుడు, బోయ వెంకటేష్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గ నాయకుడు మంజునాథ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఆయన బాధితుడి ఇంటి వెళ్లి పరామర్శించారు. బాధితుడి వైద్యం కోసం పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి సారథ్యంలో ఆయన రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు అనుంపల్లి సూరి, బోయ సుధాకర్, రెక్కల చంద్రశేఖర్‌రెడ్డి, గొర్ల సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

యాడికి: అనారోగ్యంతో మండలంలోని నిట్టూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రజక రామాంజనేయులు మృతి చెందారు. రెండు రోజుల క్రితం రామాంజనేయులుకు అధిక బీపీ, పక్షవాతం రావటంతో అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన ఆదివారం మృతి చెందినట్లు తమ్ముడు జయక్రిష్ణ తెలిపారు. కాగా మూడేళ్ల క్రితమే అనారోగ్యంతో రామాంజ నేయులు భార్య మృతి చెందారన్నారు.

నేడు సమస్యల పరిష్కార వేదిక

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. ప్రజలు సమస్యలపై అర్జీలు ఇస్తే సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించేలా చూస్తామన్నారు.